సాక్షి
చిత్తూరు
మంగళవారం । 24 । జూన్ । 2025



మా బడిని విలీనం చేయొద్దు

మా ఊరి బడిని విలీనం చేయొద్దని పలమనేరు మండలం, అయ్యంరెడ్డిపల్లె గ్రామస్తులు డిమాండ్ చేశారు. - 8లో



న్యాయం చేయండి..

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వస్తూనే ఉన్నాం.. కానీ సమస్యలు పరిష్కరించలేదని పలువురు వాపోయారు. - 8లో



తోతాపురి @ రూ.2

మొన్నటి దాకా ఫ్యాక్టరీల్లో రూ.8.. ఆ తర్వాత రూ.5.. ఇప్పుడు.. ర్యాంపుల్లో అయితే తోతాపురి కిలో రూ.2కు కొనుగోలు చేస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

బోయకొండ హుండీ ఆదాయం రూ.86.84 లక్షలు



బోయకొండలో హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.86.84 లక్షలు వచ్చినట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా నగదు రూ.86,84,343, బంగారం 64 గ్రాముల 400 మిల్లీలు, వెండి 780 గ్రాముల 400 మిల్లీలు వచ్చినట్లు పేర్కొన్నారు. విదేశీ కరెన్సీతోపాటు రణభేరి గంగమ్మ ఆలయంలో గల హుండీ ద్వారా రూ.59,250 నగదు లభించినట్లు వెల్లడించారు. ఈ ఆదాయం 46 రోజులకు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. చిత్తూరు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ పాల్గొన్నారు.

మూడు చక్రాల సైకిల్ వితరణ



దివ్యాంగుడికి సైకిల్ అందజేస్తున్న ట్రాఫిక్ సీఐ

చిత్తూరు అర్బన్: రోడ్డు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్న ఓ వ్యక్తికి చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు చేయూత అందించి అండగా నిలిచారు. సోమవారం దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్‌ను ఉచితంగా అందజేశారు. నగరానికి చెందిన మురుగన్ అనే వ్యక్తి గతంలో జరిగిన ఓ ప్రమాదంలో కాలు పోగొట్టుకున్నాడు. ఇతనికి మూడు చక్రాల సైకిల్ అవసరమని గుర్తించిన.. చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జ్యోతి, తన నగదుతో ఓ సైకిల్‌ను కొనిచ్చాడు. సీఐ నిత్యబాబు చేతుల మీదుగా సైకిల్‌ను బాధితుడికి అందజేశారు.

రెవెన్యూ డే నిర్వహించకుండా అవమానం



విజయసింహారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఎంతో గొప్ప చరిత్ర ఉన్న చిత్తూరు జిల్లాలో రెవెన్యూ డే నిర్వహించకుండా రెవెన్యూ యంత్రాంగాన్ని అవమానించారని వైఎస్సార్‌సీపీ ఉద్యోగులు, పెన్షనర్స్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయసింహారెడ్డి ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఏటా జూన్ 20న రెవెన్యూ డేని నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రెవెన్యూ డేని ఎందుకు నిర్వహించలేకపోయారో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. రెవెన్యూశాఖతో పాటు ఆ శాఖ అధికారులను, సిబ్బందిని కించపరిచినట్లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అలసత్వ ధోరణి రెవెన్యూ వ్యవస్థనే అవమానించనట్లని ఆయన ఆరోపించారు.

హామీల డాబు.. జాబేది బాబు!



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న యువత, నిరుద్యోగులు

‘ఎన్నికల ముందు యువతకు ప్రాధాన్యత నిస్తామన్నారు. భవిష్యత్ గ్యారంటీ అంటూ ఊదరగొట్టారు. ఏడాదికి 20 లక్షల ఉద్యోగాలంటూ గొప్పలు చెప్పారు. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇస్తామంటూ జబ్బలు చరిచారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలన్నీ అటకెక్కించేశారు. అడిగేవారు లేరని యువతను వెన్నుపోటు పొడిచారు. జాబులు చూపండి బాబూ..! అంటూ రోడ్డున పడాల్సిన దుస్థితికి దిగజార్చారు..’ అని నిరుద్యోగులు మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన యువత పోరు కార్యక్రమానికి పోటెత్తారు. కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. యువతకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని నినాదాలు మిన్నంటించారు.

ఏడాదైంది ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా?

- కదంతొక్కిన యువత, నిరుద్యోగులు
- కలెక్టరేట్ వద్ద యువత పోరు కార్యక్రమం
- కూటమికి వ్యతిరేక నినాదాలు
- హామీలు నెరవేర్చాలని డిమాండ్

చిత్తూరు కలెక్టరేట్/చిత్తూరు కార్పొరేషన్: ‘అధికారమే పరమావధిగా ఎన్నికల సందర్భంగా సవాలక్ష హామీలు గుప్పించారు. అధికారం చేపట్టాక ఒక్క హామీనీ నెరవేర్చకుండా దగా చేశారు..’ అంటూ యువత, నిరుద్యోగులు నిరసన గళం వినిపించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఆధ్వర్యంలో నిరుద్యోగులకు భాసటగా సోమవారం యువత పోరు కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలోని రెడ్డిగుంట జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన యువత, నిరుద్యోగులు ర్యాలీలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర నాయకులు కిషోర్, దొరబాబు, విద్యార్థి సంఘం జేఏసీ జిల్లా చైర్మన్ సద్దాం, నాయకులు రూపేష్, సుబ్బునాయుడు, శివ, బావాజీ, గజేంద్ర, నవీన్‌రెడ్డి, స్టాండ్లీ, మురళీరెడ్డి, చక్రీ, ఢిల్లీబాబు, లోకనాథ, కల్యాణ్, భరత్, విద్యార్థి నాయకులు విష్ణురెడ్డి, శశిదీప్‌రెడ్డి, కళ్యాణ్, భరత్, నరేష్, మహేష్, శ్రీకాంత్, ధనరాజ్, సుమంత్, మనోజ్‌నాయుడు పాల్గొన్నారు.

బాబూ..జాబు!

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని మోసగించిందని వైఎస్సార్‌సీపీ యువత విభాగం రాష్ట్ర కార్యదర్శి చెంగారెడ్డి విమర్శించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రూ.3 వేలు భృతి ఎప్పుడిస్తారని నిలదీశారు. రీజనల్ కో ఆర్డినేటర్ హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో యువతను మభ్యపెట్టిన చంద్రబాబు అండ్ కో నేడు హామీల ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ఎందుకు విడుదల చేయడం లేదన్నారు. కొత్త ఉద్యోగాల సంగతి దేవుడెరుగు ఉన్న ఉద్యోగాలు తొలగించకపోతే చాలని చెప్పారు. జాబ్‌క్యాలెండర్ అమలు చేస్తామన్న లోకేశ్ ఎక్కడున్నాడో కూడా తెలియడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం 420 హామీలు ఇచ్చిందని, అందులో ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. ప్రతి నిరుద్యోగికి ఇప్పటి వరకు భృతి కింద రూ.36 వేలు చెల్లించాలని చెప్పారు.





ర్యాలీగా వెళ్తున్న నిరుద్యోగులు, నాయకులు, సమస్యలను పరిష్కరించాలని చిత్తూరు జేసీకి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ హేమంత్‌రెడ్డి

అప్పు చేసి ఫీజులు



వసతిదీవెన, విద్యాదీవెన సొమ్ము సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తల్లిదండ్రులు అప్పు చేసి ఫీజులు చెల్లిస్తున్నారు. ఇటువంటి పరిస్థితి గత టీడీపీ పాలనలో చూశాం. ఇప్పుడు మరోసారి చూస్తున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చినట్లు వసతి దీవెన, విద్యాదీవెన క్రమం తప్పకుండా అందించాలి. -కిషోర్‌రెడ్డి, జీడీనెల్లూరు నియోజకవర్గ యువత అధ్యక్షుడు

బకాయిలు విడుదల చేసే వరకు పోరు



ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి బకాయిలు చెల్లించే వరకు యువత, విద్యార్థులు కలిసికట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తాం. జిల్లాలో నిరుద్యోగులు ఉద్యోగాలు లేక ఇతర రాష్ట్రాలకు తరలిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగమైన ఇవ్వాలి, లేదా ఈ 12 నెలల కాలానికి రూ.3వేలు చొప్పున భృతి అయినా విడుదల చేయాలి. -మనోజ్‌రెడ్డి, చిత్తూరు నియోజకవర్గ యువత అధ్యక్షుడు

మేనిఫెస్టో పట్టించుకోరా?



ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి. అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా ఇంతవరకు వాటి ప్రస్తావన ఎందుకు చేయడం లేదు. హామీలు అమలు చేస్తారో లేదో అనే సందేహం అన్ని వర్గాల ప్రజల్లో ఉంది. నిరుద్యోగభృతితో పాటు మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలి. - కిరణ్‌కుమార్, పుంగనూరు నియోజకవర్గ యువత అధ్యక్షుడు

ఉన్న ఉద్యోగాలు తొలగించేశారు



కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి ఏడాది అవుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఒక్క రూపాయి కూడా అందించలేదు. యువతకు ఇస్తానన్న నిరుద్యోగభృతి ఇవ్వడం లేదు. కొత్త ఉద్యోగాలు లేవు. ఏడాదిలో ఉన్న ఉద్యోగులను పీకేశారు. అకారణంగా ఉద్యోగులను తొలగిస్తున్నారో తెలియడం లేదు. - తేజారెడ్డి, పూతలపట్టు నియోజకవర్గ యువత అధ్యక్షుడు

భృతి ఇవ్వాల్సిందే



నిరుద్యోగభృతి అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఈ పథకంపై తక్షణం స్పష్టత ఇవ్వాలి. ఎంతో మంది నిరుద్యోగులు ఆశగా భృతి కోసం వేచి చూస్తున్నారు. ఏడాది గడుస్తున్నా ఇంతవరకు పథకం పై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడంలేదు. - చంద్రశేఖర్, పలమనేరు నియోజకవర్గ యువత అధ్యక్షుడు

మద్యం దుకాణానికి నోటిఫికేషన్

చిత్తూరు అర్బన్: పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణిలో కల్లుగీత సామాజికవర్గాలకు రిజర్వు చేసిన మద్యం దుకాణం నిర్వహణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండ్ శ్రీనివాస్ తెలిపారు. 50 శాతం లైసెన్సు ఫీజుతో గౌండ్ల సామాజికవర్గానికి చెందిన వాళ్లు మాత్రం ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లాలోని ఏదైనా ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

319 గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా 319 గ్రామాల్లో భూముల విభజనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 2022-24 సంవత్సరాల్లో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానులు ఆ భూముల విభజనకు సదావకాశం కల్పించారన్నారు. ఈ భూముల విభజనకు ఫీజు రూ.50 చెల్లించి గ్రామ సచివాలయంలో జూన్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జాయింట్ హక్కుదారులుగా ఉన్న భూములపై తరచూ వివాదాలు, రిజిస్ట్రేషన్ సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిలో ఆటంకాలు వస్తున్నాయన్నారు. గత ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన అర్జీలను పరిశీలించి కొన్ని జాయింట్ ఎల్‌పీఎంలను పరిష్కరించామన్నారు.

మేము చెప్పిన పాఠశాలలోనే చేరాలి!

- నసేమిరా అంటున్న తల్లిదండ్రులు
- చౌడేపల్లెలో చేర్చుకోమనడంతో వివాదం
- ఎంఈఓ, హెచ్‌ఎంతో వాగ్వాదం
- ఎట్టకేలకు 15 మందికి అడ్మిషన్లు



హెచ్‌ఎంతో వాగ్వాదానికి దిగిన తల్లిదండ్రులు

చౌడేపల్లె: మేము చెప్పిన పందిళ్లపల్లె ప్రాథమిక పాఠశాలలోనే చేరాలి... చౌడేపల్లె ఎమ్మార్సీ వద్ద ఉన్న పాఠశాలలో ఎవర్నీ చేర్చుకునేది లేదంటూ ఎంఈఓ కేశవరెడ్డి, హెచ్‌ఎం నాగరత్నమ్మ చెప్పడం వివాదానికి దారితీసింది. ఈ ఘటన సోమవారం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద చోటుచేసుకుంది. విద్యార్థుల తల్లిదండ్రుల కథనం.. చౌడేపల్లె మండలం, మేకలచిన్నేపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన 3, 4 ,5 తరగతి విద్యార్థులను పందిళ్లపల్లెలోని పాఠశాలలో విద్యాశాఖ అధికారులు విలీనం చేశారు. మేకలచిన్నేపల్లె పాఠశాల నుంచి పరిసర గ్రామాలైన ముదిరెడ్డిపల్లె, మేకలచిన్నేపల్లె, యానాదిండ్లు, తోటకురప్పల్లెకు చెందిన 35 మంది విద్యార్థులకు అక్కడి ఉపాధ్యాయులు టీసీలు ఇచ్చి పంపారు. మేకలచిన్నేపల్లె నుంచి పందిళ్లపల్లెకు చెరువు కట్టపై సుమారు కిలోమీటరుకు పైగా ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఏదైనా ప్రమాదం జరిగితే ఎలా..? అంటూ తల్లిదండ్రులు అధికారులను నిలదీశారు. మేకలచిన్నేపల్లెలో అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఉన్నత పాఠశాల వరకు సౌకర్యం ఉందని, ఆ గ్రామంలోనే పాఠశాలను కొనసాగించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. విద్యార్థులెవ్వరూ పందిళ్లపల్లెలోని పాఠశాలకు వెళ్లేది లేదని, చౌడేపల్లె ఎమ్మార్సీ వద్ద గల ప్రాథమిక పాఠశాలలో చేర్పిస్తామంటూ తల్లిదండ్రులు పట్టుబట్టారు. ఈ మేరకు సోమవారం అక్కడికి చేరుకొని హెచ్‌ఎం నాగరత్నమ్మను కలిశారు. అయితే ఆమె ససేమిర అనడంతో వివాదం నెలకొంది. తమకు అనుకూలంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఎందుకు చేర్పించుకోరంటూ తల్లిదండ్రులు హెచ్‌ఎంతో వాగ్వాదానికి దిగారు. తీరా ఎంఈఓ కేశవరెడ్డి ఆదేశాల మేరకు హెచ్‌ఎం అక్కడికి వచ్చిన 15 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చారు. దీనిపై ఎంఈఓను వివరణ కోరగా తాము ఎమ్మార్సీ వద్ద గల పాఠశాలలో చేర్చుకోబోమని చెప్పలేదని.. రెండు రోజులు ఆగాలని, లేకుంటే మీరు పందిళ్లపల్లె పాఠశాలకు వెళ్లి చేరాలని చెప్పినట్లు తెలిపారు.



చౌడేపల్లె ప్రాథమిక పాఠశాలలో చేరేందుకు వచ్చిన మేకలచిన్నేపల్లె పాఠశాల విద్యార్థులు

యువతకు వెన్నుపోటు గ్యారెంటీ

- ఉద్యోగాల భర్తీ, డీఎస్సీ, నిరుద్యోగ భృతి అంతా ఉత్తుత్తిమాటలే
- పక్క రాష్ట్రానికి చెందిన చంద్రబాబు, పవన్, లోకేష్‌కు మాత్రమే ఉన్నత ఉద్యోగాలు
- బాండ్లు పంచిన జేమ్స్‌బాండ్లు ఎక్కడ ?
- యువతకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం
- మాజీ మంత్రి ఆర్కేరోజా



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి : కూటమి ప్రభుత్వం ఉద్యోగాలు కల్పిస్తాం, డీఎస్సీ నిర్వహిస్తాం, నిరుద్యోగ భృతి ఇస్తాం, 10 లక్షల వరకు స్వయం ఉపాధి రుణాలిస్తాం అంటూ మాయమాటలు చెప్పి నిరుద్యోగులను పక్కాగా మోసం చేసిందని, జాబ్ గ్యారెంటీ అనుకున్న వారికి వెన్నుపోటు గ్యారెంటీ అని తెలిసిందని మాజీ మంత్రి ఆర్కేరోజా ధ్వజమెత్తారు. సోమవారం నియోజకవర్గం నుంచి యువత పోరుకు తిరుపతి కలెక్టరేట్‌కు బయలుదేరిన బైక్ ర్యాలీని వడమాటపేట వద్ద ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు మేనిఫెస్టోలో కూటమి ఇచ్చిన హామీలు ఏదీ నెరవేరకపోవడం, క్యాలెండర్ మారుతున్నా జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడంతో యువత ఆగ్రహావేశాలకు లోనయ్యారన్నారు. ప్రతి నియోజకవర్గంలో 500 మంది నిరుద్యోగులకు 10 లక్షల స్వయం ఉపాధి రుణాలిస్తామన్న హామీ కూడా నెరవేరలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక పక్క రాష్ట్రం హైదరాబాద్‌లో ఉన్న చంద్రబాబుకు సీఎం పోస్టు, పవన్‌కళ్యాణ్‌కు డిప్యూటీ సీఎం పోస్టు, లోకేష్‌కు మంత్రి పోస్టు, నాగబాబుకు ఎమ్మెల్సీ పోస్టు వచ్చిందని ఎద్దేవా చేశారు.

బాండ్లు ఇచ్చి ఎగ్గొట్టారు



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

ఎన్నికల ముందు ఇంటింటికీ వెళ్లి బాండ్లు పంచిన జేమ్స్‌బాండ్లు నేడు ఎక్కడికెళ్లారని ఆర్కే రోజా ప్రశ్నించారు. పవర్ స్టార్ పవర్ వచ్చాక ఫ్లవర్‌లా మారిపోయారన్నారు. గబ్బర్ సింగ్‌లాగా డైలాగులు చెప్పిన ఆయన రబ్బర్‌లాగా మెలికలు తిరుగుతున్నాడన్నారు. నేడు నిరుద్యోగులు తమకు ఉద్యోగం రాలేదు న్యాయం చెయ్యండని అడగడానికి వెళితే ఆయన సినిమాల్లో బిగాగా ఉన్నాడన్న సమాధానం వస్తోందన్నారు. డిప్యూటీ సీఎం కనబడటం లేదని ఫ్లెక్సీలు పెట్టే పరిస్థితి వచ్చిందన్నారు. చంద్రబాబుకు, పవన్‌కు, లోకేష్‌కు స్పెషల్ ఫ్లైట్లు, స్పెషల్ హెలికాప్టర్లుకు ఉన్న డబ్బు నిరుద్యోగ భృతి ఇవ్వడానికి లేదా అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే వరకు, 13 నెలల భృతి ఇచ్చేంతవరకు వారికి అండగా నిల బడి పోరాడుతామన్నారు. నియోజవర్గ యువత విభాగం నాయకులు, పార్టీ నాయకులు, కమిటీ లు, అనుబంధ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

మా ఊరే ముద్దు.. విలీనం వద్దు

- కులంపల్లె, కామినాయనపల్లె వాసుల నిరసన



నిరసన తెలుపుతున్న కుల్లంపల్లె, కామినాయనపల్లె విద్యార్థుల తల్లిదండ్రులు

ఐరాల: మోడల్ స్కూల్ పేరుతో తమ గ్రామంలో ఉన్న పాఠశాల విద్యార్థులను పుత్రమద్దికి తరలించడం సమంజసం కాదని మండలంలోని కుల్లంపల్లె, కామినాయనపల్లె గ్రామస్తులు సోమవారం పాఠశాల వద్ద నిరసన చేపట్టారు. అనంతరం వారు హెచ్‌ఎంకు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలో సుమారు 25 మంది విద్యార్థులు 3, 4, 5 తరగతులు చదువుతున్నారన్నారు. మోడల్ స్కూల్ పేరుతో 3.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న పుత్రమద్ది పాఠశాలకు విలీనం చేస్తూ విద్యార్థులను తరలించడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో 1942 నుంచి ప్రాథమిక పాఠశాల కొనసాగుతోందని, తమ గ్రామాలకు చెందిన ఎంతోమంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, ప్రస్తుతం పాఠశాలలో 96 శాతం మంది దళిత పిల్లలే ఉన్నారని చెప్పారు. పాఠశాల దూరమైతే దళిత విద్యార్థులకు విద్య దూరమయ్యే ప్రమాదం ఉందని వాపోయారు. పుత్రమద్దికి వెళ్లే మార్గం గుండా మధ్యలో చెరువు కట్ట ఉందని, చెరువు నిండిన సమయంలో మొరవ ఉధృతంగా సాగుతుందని, ఆ సమయంలో ఆ మార్గం గుండా పాఠశాలకు వెళ్లడం చాలా ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఎంసీ అనుమతి లేకుండా తమ గ్రామంలోని పాఠశాలను విలీనం చేశారని మండిపడ్డారు. ‘మోడల్ స్కూల్ మాకొద్దు.. మా ఊరు పాఠశాల మాకు ముద్దు’ అంటూ తల్లిదండ్రులు నినాదాలు చేశారు.

తోతాపురి @ రూ.2

ఉమ్మడి జిల్లాలో మామిడి ధర మళ్లీ పతనమైంది. ర్యాంపుల్లో తోతాపురి కేజీ రూ.2 పలుకుతోంది. ఫ్యాక్టరీలో రూ.5కు అమ్ముడుబోతోంది. కూటమి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.8 పూర్తిగా అంతమైంది. జిల్లా యంత్రాంగం ఫ్యాక్టరీల్లో రూ.6, ర్యాంపుల్లో రూ.3.5 తగ్గదని చెప్పింది. కానీ క్షేత్రస్థాయిలో ఇవేవీ అమలుగాకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మళ్లీ పతనమైన మామిడి ధరలు

- తోతాపురి ర్యాంపుల్లో కేజీ రూ.2
- ఫ్యాక్టరీలో రూ.5కు కొనుగోలు
- రూ.6 తగ్గకుండా చూస్తామన్న అధికార యంత్రాంగం
- మరింత దిగజారే అవకాశం
- మండిపడుతున్న రైతులు


చిత్తూరు నగరంలోని మామిడి కాయల ఫ్యాక్టరీలో క్యూకట్టిన వాహనాలు


కుప్పలు పోసిన మామిడి కాయలు

కాణిపాకం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 56 వేల హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉంది. మొత్తంగా 6.45లక్షల మెట్రిక్ టన్నుల వరకు మామిడి దిగుబడి అయ్యింది. టేబుల్ రకాలు కోత చివరి దశకు చేరుకుంటే... తోతాపురి కోతలు ఇప్పుడిప్పుడే ఆరంభమయ్యాయి. ఈ రకం మామిడి 39,895 హెక్టార్లు ఉంటే.. 4.99 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని ఉద్యానశాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 1.5 లక్షల టన్నుల కాయలు ఫ్యాక్టరీలకు చేరినట్లు వారి గణాంకాలు చెబుతున్నాయి. ఈ నెల ప్రారంభం నుంచి తోతాపురి కోతలు ప్రారంభమైతే.. చాలా ఫ్యాక్టరీలు తోతాపురి కొనలేమని చేతులెత్తేశాయి. అధికారులు పట్టుబట్టినా కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

మద్దతు ధర మూన్నాళ్ల ముచ్చటే

కూటమి ప్రభుత్వం తోతాపురి రకం మామిడి కేజీ రూ.8గా మద్దతు ధర ప్రకటించింది. ప్రభుత్వ ప్రోత్సాహ నిధి కింద మరో రూ.4తో కలిపి మొత్తం రూ.12 ఇస్తామని ప్రచారం చేసింది. దీంతో కూటమి నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యేలు రోడ్డుపైకి వచ్చి పండుగ చేసుకున్నారు. తీరా ఆ సంబరాలు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి.

ర్యాంపుల్లో కేజీ రూ.2

ఈ సారి మామిడి ధరలు, అవస్థలు చూసి ర్యాంపులు తెరుచుకోవడం కష్టతరంగా మారింది. ర్యాంపులు ఫ్యాక్టరీకి రోజూ ఒక లారీ కాయలు తరలించేలా అవకాశం కల్పించడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40 ర్యాంపులు ఏర్పడ్డాయి. ఈ ర్యాంపుల్లో చాలా వాటికి రిజిస్ట్రేషన్ కూడా లేవు. అనాధికారికంగా ర్యాంపులను నిర్వహిస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండే ఫలాన్ని ర్యాంపు నిర్వాహకులు చులకనగా చూస్తున్నారు. వీరు ఆడిందే..ఆట పాడిందే పాటగా ధరలను ఫిక్స్ చేస్తున్నారు. తొలుత తోతాపురి కేజీ రూ.4 అంటూ రంగంలోకి దిగారు. తర్వాత రూ.3.50, రూ.3కు సిండికేట్ అయ్యారు. శనివారం నుంచి తోతాపురి కేజీ ధర రూ.2 పలుకుతోంది. చిత్తూరు, పులిచెర్ల, బంగారుపాళెం, దామలచెరువు, తిరుపతి పరిసర ప్రాంతాల్లో రూ.2 లెక్కన కొనుగోలు చేస్తున్నారు.

ఫ్యాక్టరీలో రూ.5

ఫ్యాక్టరీల్లో తోతాపురి కేజీ రూ.4, రూ.5కు కొనుగోలు చేస్తున్నారు. అదే టోకన్ తీసుకున్న రైతు వద్ద తోతాపురి రూ.6కు కొనుగోలు చేస్తున్నాయి. పలు ఫ్యాక్టరీలు సిండికేట్ అయ్యి ధరలను రూ.6 నుంచి రూ.5కు తగ్గించేశాయి. 95శాతం ఫ్యాక్టరీలో ఇదే ధరలు మాత్రమే అమలవుతున్నాయి.

ఈ పర్యటనలు ఎందుకో?

జిల్లా అధికారులు ఫ్యాక్టరీల వద్దకు సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. రైతులు, ఫ్యాక్టరీ నిర్వాహకులతో మాట్లాడుతున్నారు. అయితే అధికారులు మరోవైపు తప్పులన్నీ రైతులపై నెట్టేస్తున్నారు. పక్వానికి రాని కాయలను కోసి తెచ్చేస్తున్నారని, ఆగస్టు వరకు కోత కోయవచ్చని, ర్యాంపులు, ఫ్యాక్టరీలు అడిగిన రేట్లకు ఇచ్చేస్తున్నారని అధికారులు చేతులెత్తేస్తున్నారు. ప్రభుత్వానికి కూడా ఈ విషయం చేరవేసి మామిడి రైతులను నట్టేటా ముంచేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు.

● పొగాకుతో పాటు మామిడికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. తోతాపురి కేజీ రూ.8కు ఫ్యాక్టరీలు కొనుగోలు చేయాలని, ప్రోత్సాహక నిధి మరో రూ.4 ఇస్తామని చెప్పింది. నేను ఈరోజు (14వ తేదీ) కొన్ని ఫ్యాక్టరీలకు తిరిగాను. గుడిపాల ఫ్యాక్టరీలో రూ.7 అంటే ఒప్పుకోలేదు. కేజీ రూ.8కే కొనుగోలు చేయాలని ఆదేశించా. ఆ ఫ్యాక్టరీయే కాదు. అన్ని ఫ్యాక్టరీలు కూడా మద్దతు ధర ప్రకారం రూ.8కే కొనాలి. బయట కాయలను రానివ్వను.

–అచ్చెన్నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి

● మా ప్రభుత్వం మామిడి ధర రూ.8, ప్రోత్సాహనిధి రూ.4 చొప్పున చెల్లిస్తామని ప్రకటించింది. ఏ ఫ్యాక్టరీలో అయినా కాయలు వద్దు అనేదానికి లేదు. తీసుకోవాల్సిందే. కచ్చితంగా ఫ్యాక్టరీలు తెరవాల్సిందే. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కాయలు కొనాల్సిందే. లేకుంటే ఆ ఫ్యాక్టరీ, బ్రోకర్లు, వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.

– గురజాల జగన్మోహన్, ఎమ్మెల్యే, చిత్తూరు
(చిత్తూరు మామిడి కాయల మార్కెట్‌లో ఈనెల 6వ తేదీన చేసిన వ్యాఖ్యలు)

● జిల్లాలో మామిడి రైతులు కష్టాలు పడుతున్నారు. ఈ కష్టాలను అధిగమించేందుకు టోల్‌ఫ్రీ నంబరు తీసుకొచ్చాం. ర్యాంపుల్లో కొద్దిగా మార్జిన్ పెట్టుకుని అమ్ముతున్నారు. అక్కడ కేజీ రూ.3.50 కొనుగోలు చేస్తున్నారు. ఫ్యాక్టరీల్లో రూ.6 ఉంది. రూ.6 తగ్గకుండా చూస్తాం. –విద్యాధరి, జేసీ
(ఈనెల 17న జరిగిన ప్రెస్‌మీట్‌లో ఇన్‌చార్జ్ కలెక్టర్ హోదాలో అన్న మాటలు)

..కానీ వీరి మాటలు నీటిమూటలేనని తేలిపోయింది. మంత్రి చెప్పినా.. అధికారులు చెప్పినా ఎవ్వరూ పట్టించుకోలేదు. మామిడి ధర పతనమవుతూనే ఉంది.


మామిడి లోడింగ్ చేస్తున్న కూలీలు

ఉమ్మడి జిల్లా సమాచారం

మామిడి విస్తీర్ణం:	56వేల హెక్టార్లు
దిగుబడి అంచనా: 6.45 లక్షల మెట్రిక్ టన్నులు	
తోతాపురి సాగు విస్తీర్ణం:	39,895 ఎకరాలు
దిగుబడి అంచనా: 4.99 లక్షల మెట్రిక్ టన్నులు	
పళ్ల గుజ్జు పరిశ్రమలు:	43
పనిచేస్తున్న ఫ్యాక్టరీలు:	31
ర్యాంపులు:	40
ఫ్యాక్టరీలకు చేరిన కాయలు: 1.3 లక్షల మెట్రిక్ టన్నులు	

ఏమైపోవాలి?



ఈసారి దిగుబడి బాగొచ్చింది. పది రూపాయలు వస్తుంది అనుకున్నాం. ఇప్పుడు ఆ పంటను చూస్తే కన్నీళ్లు తప్ప కాసులు రావడం లేదు. ఫ్యాక్టరీలకు తోలుదామనుకుంటే టోకన్లు లేవు. నేరుగా తీసుకెళితే ఫ్యాక్టరీ వాళ్లు తీసుకోవడం లేదు. ర్యాంపుకు వెళితే కేజీ రూ.2కు అడుగుతున్నారు. ఇలాగైతే రైతులు ఏమైపోవాలి.

–హరినాథ్, పులిచెర్ల మండలం

మద్దతు ధరపై ఏమంటారు?



కూటమి ప్రభుత్వం తోతాపురి కేజీకి రూ.12 కల్పించింది. ఈ ధరకే కొనాలని చిత్తూరు ఎమ్మెల్యే ఫ్యాక్టరీ నిర్వాహకులకు, మధ్యవర్తులకు మీడియా ముందు వార్నింగ్‌లు ఇచ్చారు. ఫ్యాక్టరీలు కొనలేదంటే సీజ్ చేస్తామన్న రీతిలో వ్యాఖ్యలు చేశారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చిత్తూరు పర్యటనకు వచ్చి ఫ్యాక్టరీలు కేజీ రూ.8కి కొంటాయని ప్రగాల్భాలు పలికారు. కానీ వీరి మాటలు.. వార్నింగ్‌లు అన్నీ ఉత్తుత్తిదేనని తేలిపోయింది. ఇప్పుడు ర్యాంపుల్లో కిలో రూ.2కు, ఫ్యాక్టరీల్లో రూ.5కు కొనోగులు చేస్తున్నారు.

–విజయానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, చిత్తూరు

క్లుప్తంగా

అక్రమ మైనింగ్‌పై దాడులు


అక్రమ గ్రానైట్ దిమ్మెలను సీజ్ చేస్తున్న పలమనేరు మైనింగ్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

శాంతీపురం/ పలమనేరు: కుప్పం నియోజకవర్గం, శాంతిపురం మండలం, 121 పెద్దూరు సమీపంలోని జేబీ కొత్తూరు వద్ద పచ్చనేతలు అక్రమంగా సాగిస్తున్న మైనింగ్‌పై అధికారులు కొరడా ఝుళిపించారు. మైనింగ్ డీడీ సత్యనారాయణ ఆదేశాలతో పలమనేరు మైనింగ్ అధికారులు సోమవారం దాడులు చేశారు. అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన పది గ్రానైట్ దిమ్మెలను సీజ్‌చేశారు. తెల్లబోయే దోపిడీ శీర్షికన సాక్షి దినపత్రికలో సోమవారం వెలువడిన కథనంపై మైనింగ్ డీడీ స్పందించారు. పులిగుండ్లపల్లికి చెందిన డీకేటీ రైతుల పొలాల్లోని తెలుపు గ్రానైట్‌ను అధికార పార్టీకి చెందిన వారు యథేచ్ఛగా మైనింగ్ చేసినట్టు అధికారులు గుర్తించారు. అయితే అక్కడ పనులు చేస్తున్న వాహనాలను ఎందుకు వదిలేశారో చెప్పడం లేదు. ఇదే మండలంలో అక్రమ మైనింగ్ సాగుతోందని గతంలో ప్రతిపక్ష నేతగా ఉండిన చంద్రబాబునాయుడు నానా హంగామా చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు అధికార పార్టీ వాళ్లే అక్రమ మైనింగ్‌కు పాల్పడుతుంటే ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదనే మాట అక్కడ వినిపిస్తోంది. ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకున్నారా అని మైనింగ్ డీడీ సత్యనారాయణను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన సెల్‌ఫోన్‌ను లిఫ్ట్ చేయకపోవడం కొసమెరుపు.

వస్తూనే ఉన్నాం..న్యాయం చేయండి

- ప్రజాసమస్యల పరిష్కార వేదికకు పోటెత్తిన ప్రజలు
- వివిధ సమస్యలపై 283 అర్జీలు

చిత్తూరు కలెక్టరేట్ : ×ప్రతి వారం దూరాభారం నుంచి కలెక్టరేట్‌కు వస్తూనే ఉన్నాం.. తమ సమస్యలు పరిశీలించి న్యాయం చేయాలి౯ అని బాధిత అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు వినతులు అందజేశారు. పాల్గొన్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 283 అర్జీలు వచ్చినట్టు కలెక్టరేట్ ఏవో వాసుదేవన్ వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్లు అనుపమ, విజయలక్ష్మి పాల్గొన్నారు.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

రేషన్ కార్డు ఇప్పించండి


వృద్ధురాలు కస్తూరి

రేషన్ కార్డు ఇప్పించాలని చిత్తూరు రూరల్ మండలం, అనుపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు కస్తూరి కోరారు. ఈ మేరకు ఆమె పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. తన కూతురి వద్ద గత నాలుగేళ్లుగా అనుపల్లిలో నివసిస్తున్నాని, చాలా రోజులుగా రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకుంటున్నా మంజూరు చేయడం లేదన్నారు.

కమ్మ కార్పొరేషన్‌లో రుణం ఇప్పించండి


జేసీకి మొరపెట్టుకుంటున్న దివ్యాంగుడు గోపాల్

ఏపీ కమ్మ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో కమ్మ రుణంకు దరఖాస్తు చేసుకున్నాని, రుణం ఇప్పించాలని చిత్తూరు రూరల్ తాళంబేడు గ్రామానికి చెందిన దివ్యాంగులు గోపాల్ కోరారు. ఈ మేరకు ఆయన జేసీకి వినతిపత్రం అందజేశారు.

పాఠశాల విలీనం వద్దు


నిరసన వ్యక్తం చేస్తున్న పలమనేరు మండలం కోతిగుట్ట గ్రామస్తు

తమ గ్రామంలోని పాఠశాలను విలీనం చేయకూడదని పలమనేరు మండలం, కోతిగుట్ట గ్రామస్తులు వనజ, బుజ్జెమ్మ, రోజా కోరారు. ఈ మేరకు గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ వద్ద తమ పిల్లలతో కలిసి నిరసన చేపట్టారు. తమ గ్రామంలోని పాఠశాలలో 3, 4, 5 తరగతులను దూరప్రాంతంలో ఉన్న పెంగరకుంట గ్రామంలోని పాఠశాలలో విలీనం చేశారని, ఆ పాఠశాలకు వెళ్లడం ప్రమాదాలతో కూడుకున్న పని అని వాపోయారు. ఆయా తరగతులను తమ గ్రామంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

మా గ్రామంలోనే బడి కొనసాగించాలి



తమ గ్రామంలోనే ప్రభుత్వ బడిని కొనసాగించాలని గంగాధరనెల్లూరు మండలం, అంబోధరపల్లి గ్రామస్తులు రామయ్య, నరసమ్మ, భారతి తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం తమ గ్రామంలోని బడిని విలీనం చేయకూడదన్నారు. ఎవరిని అడిగి తమ గ్రామంలోని పాఠశాలను విలీనం చేశారని ప్రశ్నించారు. అనంతరం జేసీకి వినతిపత్రం అందజేశారు.

విలీనం వద్దు



పాఠశాల విలీనం అన్యాయం అని శ్రీరంగరాజపురం మండలం, దిగువ మెదవాడ ఎస్టీ కాలనీ వాసులు గాంధీ, ధనలక్ష్మి, దేవి వాపో యారు. ఈ మేరకు ఆ గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను దూర ప్రాంతంలో ఉన్న ఎగువ మెదవాడ పాఠశాలలో విలీనం చేయడం అన్యాయమన్నారు. తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించకుండానే బడిని విలీనం చేయడం సబబు కాదన్నారు.

5న జాతీయ లోక్ అదాలత్

చిత్తూరు అర్బన్: జూలై 5న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భారతి కోరారు. సోమవారం చిత్తూరు న్యాయస్థానాల సముదాయంలోని జిల్లా న్యాయ సేవాసదన్ భవనంలో ఆమె మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో పెండింగ్ కేసుల పరిష్కారం కోసం జాతీయ అదాలత్ నిర్వహించనున్నట్టు చెప్పారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, ఇతర కేసులను అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులకు ఏవైనా సందేహాలు ఉంటే చిత్తూరు కోర్టులో డీఎల్ఎస్ఏ భవనంలో సంప్రదించాలన్నారు.


మాట్లాడుతున్న న్యాయమూర్తి భారతి

మా బడిని విలీనం చేయొద్దు

పలమనేరు: తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను విలీనం చేయొద్దని పలమనేరు మండలం కొలమాసనపల్లి పంచాయతీ అయ్యంరెడ్డిపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. వారు సోమవారం గ్రామంలోని బడికి తాళం వేసి విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఇక్కడ 20 మంది పిల్లలు వున్నారని తెలిపారు. ఈ బడిని రెండు కిలోమీటర్ల దూరంలో వున్న శ్రీరంగరాజపురం బడిలో విలీనం చేశారని తెలిపారు. ఎవరికైనా ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. తాము పిల్లలను ప్రతిరోజూ పొరుగూరిలో వదిలి రావడం కష్టంగా ఉంటుందని తెలిపారు. పాఠశాల విలీనాన్ని విరమించుకోకుంటే పిల్లలను చదువు మాన్పిస్తామని హెచ్చరించారు.

రిటైల్ కోర్సుకు ఉచిత శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని నిరుద్యోగ యువతకు రిటైల్ కోర్సుకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి డొనప్ప సోమవారం విలేకరులకు తెలిపారు. జిల్లాలో పది, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత, ఫెయిల్ అయిన అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 28న జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించే రిజిస్ట్రేషన్లలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

లారీ ఢీకొని యువకుడి మృతి


మృతి చెందిన అభిషేక్

యాదమరి: లారీ ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై కథనం.. సోమవారం మండలంలోని పెరియంబాడికి చెందిన అభిషేక్ (23) వ్యక్తిగత పనులు నిమిత్తం కాశిరాళ్లకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురయ్యాడు. మార్లబండ సమీపంలో చిత్తూరు నుంచి గుడియాత్తం వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. విగతజీవిగా పడి ఉన్న తమ కుమారుడిని చూసి అభిషేక్ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సచివాలయ ఉద్యోగులపై వివక్ష తగదు


కార్పొరేషన్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

చిత్తూరు అర్బన్: సచివాలయాల్లో పనిచేస్తున్న కార్యదర్శుల బదిలీలపై ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులతో వేలాది మందికి ఇబ్బందులు తప్పవని సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ జీవో వల్ల ఉద్యోగులపై పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన జీవో నెం-05ను సవరించాలని కోరుతూ సోమవారం చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సచివాలయ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. యూనియన్ నాయకులు మహేష్, వినోద్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సొంత మండలాల్లో పనిచేసుకునే అవకాశం కల్పించకుండా, ప్రభుత్వం తమపై వివక్ష చూపడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే జీవోను సవరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ నరసింహ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు ప్రతాప్, వెంకటేష్, సతీష్, జానకిరామ్ పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 33 ఫిర్యాదులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో నిర్వహించిన పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో 33 వినతులు అందాయి. స్థానిక ఏఆర్ కార్యాలయంలో చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్ రాజు ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో మోసాలు, వేధింపులు, కుటుంబ తగాదాలు, ఇంటి తగాదాలు, భూ తగాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సమస్యలున్నాయి. పలు ఫిర్యాదులపై అప్పటికప్పుడే వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయా స్టేషన్ హౌజ్ అధికారులతో మాట్లాడారు. ప్రతి ఫిర్యాదుపై విచారణ చేపట్టి, పరిష్కరించాలని ఆదేశించారు. పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకరరావు కూడా ఫిర్యాదులు స్వీకరించారు.


సమస్యలు వింటున్న ఏఎస్పీ రాజశేఖర్ రాజు